క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

టి.నరసాపురం: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టి.నరసాపురం బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై కె.జయబాబు ప్రారంభించి, మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేశారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.వెంకటేశ్వరావు, సెక్రటరీ పి.చందు, వైస్ ప్రెసిడెంట్ మహారాజ్, ట్రెజరీ వాసు, కమిటీ., యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో...

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం చలివేంద్రం ప్రారంభించినట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

బుర్రకథ కళాకారుడికి ఉగాది పురస్కారం

జంగారెడ్డిగూడెం: లక్కవరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు ఉగాది పురస్కారం అందుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించి ఉగాది పురస్కారాల్లో కళారత్న అవార్డును కనకారావు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. కళారంగానికి సబ్బి కనకారావు చేసిన కృషికి అవార్డు ఒక కలికితురాయి అని పలువురు కళాకారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కనకారావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాలపర్తి శ్రీనివాస్, పెనుమర్తి రామ్‌కుమార్, కేఎల్‌ఎన్ ధనకుమార్ పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గుడిమెట్ల యుగంధర్, ఉపాధ్యక్షుడిగా మండవల్లి రాంబాబు, కార్యదర్శిగా రామిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా బేతా రమేష్, కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పట్టణంలో రెండు ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కొయ్యలగూడేనికి సీపీఐ ప్రచార జాత

కొయ్యలగూడెం: సీపీఐ దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాత కార్యక్రమం ఆదివారం కొయ్యలగూడెంకి చేరుకుంది. పార్టీ శతవార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మద్దతు విశేషంగా లభిస్తుందని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రచార జాత సభ్యులకు మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని దోచిపెడుతున్నాయని నాయకులు విమర్శించారు. ప్రచార జాత సభ్యులు కళాత్మకమైన గేయాలతో ప్రజలను ఆకర్షించారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలో మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో స్థానిక ఉండ్రావజరపు రమేష్ ఇంటి వద్ద నుంచి హైస్కూల్ వరకు మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు వి.శివాజీ, పి.నాగార్జున, జె.శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజ, మల్లాబత్తుల సుబ్బారావు, స్థానిక నాయకులు పోల్నాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. దొరమామిడిలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం వెట్టి సుబ్బన్న అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏప్రిల్ 1వ తేదీన జిల్లాలోని అన్ని మండలాల్లో ధర్నాలు, ప్రదర్శనలు, ఏప్రిల్ 7వ తేదీన ఆర్డీఓ కార్యాలయాల వద్ద రైతులతో ధర్నాలు చేస్తామని, ఆయా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దర్శకుడు నవీన్‌కు సత్కారం

ద్వారకాతిరుమల: నేషనల్ హ్యూమన్ రైట్స్ వారు ఇటీవల నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో గెలుపొంది స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్న జంగారెడ్డిగూడెంకు చెందిన యువ దర్శకుడు లొట్ల నవీన్‌ను ఆదివారం మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన నవీన్‌ను ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మనం గోపి, ట్రెజరర్ దర్శిపాము పవన్‌కుమార్, షేక్ అన్సారి, జి.విలియమ్స్, మాదాసు స్వామి, జూనిపూడి సిద్దయ్య తదితరులు కలిసి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఊరూరా ఉగాది ఉత్సవం

- ఘనంగా కొండదేవతలకు పూజలు
- గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో దద్దరిల్లిన గిరిపల్లెలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్దిక్షేత్రంలో పంచాంగ శ్రవణం



జంగారెడ్డిగూడెం: లక్కవరంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



జంగారెడ్డిగూడెం: విశేషాలంకరణలో పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి



జంగారెడ్డిగూడెం: విశేష అలంకరణలో పూజలందుకున్న గంగానమ్మ తల్లి



టి.నరసాపురం: గ్రామదేవత అర్ల ముత్యాలమ్మకు పొంగలి సమర్పించిన దృశ్యం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన పల్లెల్లో ఆదివారం ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఊరూరా ఉగాది పండుగతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే పురోహితులు పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పంచాంగం చదివి వినిపించారు. అలాగే విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇంటిల్లిపాది షడ్రుచుల పచ్చడిని ఆరగించారు. అలాగే గిరిజన గ్రామాల్లో కొండదేవతలకు ఘనంగా పూజలు చేశారు. మండలంలోని పలుగ్రామాల్లో గ్రామ దేవతలుగా కొలవబడుతున్న గంగానమ్మకు పూజలు చేశారు. గుబ్బల మంగమ్మ, ముత్యాలమ్మ, నాగులమ్మ, కనకదుర్గమ్మ, పోచమ్మ తల్లి తదితర సకల దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ముప్పినవారిగూడెం సమీపంలో ఉన్న కడియలమ్మ గుడి వద్ద ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గిరిజన సంప్రదాయ నృత్యాల్లో గిరిజన మహిళలు పాల్గొన్నారు. దాసియ్యపాలెంలో సమ్మక్క, సారక్క అమ్మవార్లకు గిరిజనులు వైభవంగా పూజలు నిర్వహించారు. మంచులవారిగూడెంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

మద్దిలో ఉగాది వేడుకలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ×శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకుని ఆలయ అర్చకులచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పంచాంగాలను ఉచితంగా అందజేశారు. సీనియర్ నాయకులు కరాటం రాంబాబు, గురవాయిగూడెం పంచాయతీ ప్రెసిడెంట్ సత్యవేణి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పట్టణ ప్రముఖులు రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్వామి వారిని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ అధ్యక్షుడు వేగేశ్న సూర్యనారాయణ రాజు (కనకరాజు సూరి) దర్శించుకున్నట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. మధ్యాహ్నానికి స్వామి వారి దేవస్థానానికి రూ.1,30,000 ఆదాయము లభించినట్లు ఈవో తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కూరగంటి రంగారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిజాతగిరిలో...

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిపారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు భోగవల్లి రత్నాజీ, బంగారులక్ష్మి కుటుంబసభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

గంగానమ్మ ఆలయంలో...

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయాల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక నెమలిపింఛం దండల అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారి అలంకరణ, ప్రసాద వితరణకు సహకరించారు.

నూకాలమ్మ ఆలయంలో...

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కళ్యాణ కళావేదిక వద్ద ప్రముఖ వేదపండితులు కాళ్ళకూరి శంకర మహేష్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆధ్యాత్మికవేత్త శశికుమార్ ఉగాది విశిష్టతను తెలియజేశారు. ఆధ్యాత్మికవేత్త కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో అన్నదానం

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారంతో ముగిసినట్లు ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఉగాది సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ విద్యా శంకరానందస్వామి పంచాంగ శ్రవణం చేయగా, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. అమ్మవారికి రాజమండ్రికి చెందిన తమ్మా శ్రీరామ్, ఇంద్రాణి దంపతులు కేజీ వెండి సమర్పించినట్లు బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు.

లక్కవరంలో ఉగాది సందడి

జంగారెడ్డిగూడెం: లక్కవరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు పానకాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పోలవరం రూరల్: ఉగాది పండుగ ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పోలవరం, పట్టిసీమ, గూటాల గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో తెల్లవారుజామునుంచే కిటకిటలాడాయి. ఆలయాల్లో షడ్రుచులతో ఉగాది పచ్చడిని భక్తులకు అందజేశారు. జగన్నాధపేటలోని వినాయకుని ఆలయం వద్ద పూజలు నిర్వహించి పులిహోర, మజ్జిగను అందించారు.

పంచాంగ శ్రవణం

కొయ్యలగూడెం: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ అనిపెద్ది వేంకట నరసింహ శర్మ ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం ఫలితాలు, రాశుల వారికి కలిగే శుభాలు గురించి విశ్లేషించారు. అనంతరం ప్రాంతీయ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో అనిపెద్ది నరసింహ శర్మను ఘనంగా సత్కరించారు. దేవతాపారాయణలు నిర్వహిస్తున్న మహిళా భక్తులను స్పందన స్వచ్ఛంద సంస్థ సత్కరించింది.

టి.నరసాపురం: టి.నరసాపురం గ్రామ దేవత అర్ల ముత్యాలమ్మ 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 3వ రోజు ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగలి సమర్పించారు. మండలంలో అన్ని ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద పంచాంగ శ్రవణాలను ఏర్పాటు చేశారు.

గ్రామ దేవత గంగానమ్మకు పూజలు



బుట్టాయగూడెం: దుద్దుకూరులో పూజలు చేస్తున్న రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: దుద్దుకూరులో గ్రామ దేవత గంగానమ్మకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి దూప దీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



బుట్టాయగూడెం: గంగానమ్మ గుడి వద్ద ఉత్సవాల సందడి



జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం



పోలవరం రూరల్: జగన్నాధపేటలో మజ్జిగ, పులిహోర పంపిణీ



కొయ్యలగూడెం: మదన గోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

హామీలు అమలు చేయలేని ఘనత చంద్రబాబుదే

పోలవరం రూరల్: పోలవరాన్ని ప్రత్యేక జిల్లా చేస్తానని మాటిచ్చి మరిచిపోయారని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. పోలవరం అంబేద్కర్ సెంటర్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలవరాన్ని ప్రత్యేక జిల్లా చేస్తానని పదేపదే సభలు సమావేశాల్లో మాట్లాడి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ప్రస్తుతం ఇప్పుడు ఎక్కడా ఆ ప్రసక్తే ఎత్తడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు పెట్టి ఏ ఒక్కటి కూడా అమలు చేయలేని ఘనత చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇచ్చిన పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవని, వారిని గాలికి వదిలేసారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

బుట్టాయగూడెం: ఇటీవల రాజమండ్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ జీలుగుమిల్లిలో ఆదివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీఏ మండల అధ్యక్షుడు సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం నిజ నిర్ధారణ కమిటీ వేయాలన్నారు. అలాగే ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పాస్టర్లపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సియోను కుమార్, సీఎస్ఐ చర్చి పాస్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

కామవరపుకోట: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మరణాన్ని నిరసిస్తూ ఆడమిల్లిలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో సంజీవరావు కాలనీ నుంచి లక్ష్మీపతి కాలనీ వరకు నిర్వహించిన ర్యాలీలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. షాలోమ చర్చ్ పాస్టర్ సుధీర్ డేనియల్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల అకాల మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు అని, అయన మరణానికి సంబంధించి ప్రభుత్వం విచారణ నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎం.జార్జ్, సీహెచ్ థామస్, విజయ్ రాజు, ప్రభు దాస్, అనిల్ సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో క్రైస్తవుల శాంతి ర్యాలీ



కామవరపుకోట: ఆడమిల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

క్షత్రియ సేవా సమితి సభ్యులకు సత్కారం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి (యూకేఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, ప్రధాన కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఏపీ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న సూర్యనారాయణరాజు (కనకరాజుసూరి) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూకేఎస్‌ఎస్ అధ్యక్షుడు పి.రంగరాజు సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. చిన్నారులు గొట్టుముక్కల సరయు, సహస్ర కూచిపూడి నృత్యం చేశారు. అనంతరం యూకేఎస్‌ఎస్ అభివృద్ధికి కృషిచేసిన క్షత్రియులకు సన్మానం చేశారు.

కలపను అక్రమంగా తరలిస్తున్న వాహనాల సీజ్

కొయ్యలగూడెం: కలప అక్రమంగా తరలిస్తున్న ఒక లారీ, ట్రాక్టర్‌ని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ ఆదివారం పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అక్రమంగా మారుజాతి పుల్లను తరలిస్తున్న ట్రాక్టర్‌తో సహా లారీని అటవీశాఖ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారన్నారు. కలప విలువ సుమారు రూ.35వేలు ఉంటుందని తెలిపారు, ట్రాక్టర్ గంగవరం మెట్ట వైపు నుంచి వస్తుందని, అదేవిధంగా లారీ రాజోలు వైపు నుంచి యర్రంపేట గ్రామం వైపుగా వస్తుందని సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. శివాజీ, వీరారెడ్డి పాల్గొన్నారు.

విర్డ్ ట్రస్ట్‌లో సభ్యులుగా ఇద్దరికి చోటు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రి ట్రస్టు నూతన సభ్యులుగా శ్రీవారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త వీఎస్ఎన్ నివృతరావు, డాక్టర్ భవ్యచంద్ నియమితులయ్యారు. ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన ఆదివారం ఆస్పత్రిలో ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నివృతరావు, భవ్యచంద్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులంతా కలసి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ఆ తరువాత గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో ఆస్పత్రిలో తయారైన ప్రోస్తసిస్ 3డీ ప్రింట్ కృతిమ అవయవాలు, కాలిపర్స్‌ను 15 మంది దివ్యాగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎక్స్ అఫీషియో సభ్యుడు, శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు తదితరులున్నారు.



విర్డ్ ఆస్పత్రిలో రోగికి కృత్రిమ అవయవాన్ని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

సారె సమర్పణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ అమ్మవారికి మహిళలు సారెను సమర్పించారు. ఆదివారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు గోపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల స్వీట్లు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ, చీరలతో అమ్మవారికి సారెను స్థానిక గంగానమ్మ గుడి వద్ద నుంచి విజయదుర్గమ్మ ఆలయం వరకు శోభాయాత్రగా వచ్చి, విజయదుర్గమ్మకు సమర్పించారు. ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించి, పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ సభ్యులు మారిశెట్టి రాధాకృష్ణ, మాడా రామ్మోహనరావు, ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



విజయదుర్గమ్మకు సారెను తీసుకువెళుతున్న మహిళా భక్తులు

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం మైసన్నగూడెంకు చెందిన షేక్ బషీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తరచూగా భార్య గౌసియాబేగంతో గొడవ పడుతూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మద్యం సేవించి వచ్చిన బషీర్ మోటార్‌సైకిల్ కొనివ్వలేదని ఇనుపరాడ్డుతో భార్య గౌసియాబేగంపై దాడి చేశాడు. గాయపడిన ఆమె స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

మాజీ హోం మంత్రికి నేతల శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి తానేటి వనితకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నల్లజర్ల మండలం పార్టీ అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఆమెను ద్వారకాతిరుమల ఎంపీపీ బొండాడ మోహిని, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాను కప్పి, ఆమెకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రచారకమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలకా సతీష్, భోగరాజు సాయికృష్ణ, నల్లంటి రామారావు, కేవీఆర్, మాధవ్, సర్నాల శ్రీరాములు తదితరులున్నారు.



వనితకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీపీ, తదితరులు

నేటి నుంచి శ్రీసుబ్రహ్మణ్యస్వామి పాశుపత హోమం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీసుబ్రహ్మణ్య పాశుపత భువనేశ్వరి యాగం ఈనెల 31 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ధర్మకర్త బాలం దత్తుడు పేర్కొన్నారు. ఈ హోమం భక్తులకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త తెలిపారు.

కోడి పందేలపై దాడులు

కామవరపుకోట: ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆడమిల్లిలో జరిపిన దాడుల్లో 5 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.8,500 నగదు స్వాధీన పరుచుకున్నట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు అలాగే వీరిశెట్టిగూడెంలో 5 మందిని అదుపులోకి తీసుకొని 3 కోడి పుంజులు రూ.4,500 నగదు స్వాధీన పరుచుకుని, కేసులు నమోదు చేశామన్నారు.

కొయ్యలగూడెం: గంగన్నగూడెం శివారులో కోడిపందేలపై ఆదివారం దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసి రూ.2500 నగదు, ఒక కోడి కత్తి, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు.

బాకీ తీర్చమంటే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మాచర్ల లక్ష్మీ, అదే కాలనీలో ఉంటున్న షేక్ ఫయాజ్ హుస్సేన్‌కు రెండేళ్ల క్రితం రూ. 5లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల బాకీ తీర్చమని అడిగితే ఆమెపై దరుసుగా ప్రవర్తించి, డబ్బులు అడిగితే చంపుతానని హుస్సేన్ బెదిరించాడు. దీనిపై ఆదివారం లక్ష్మీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.